ప్రశాంత జీవనానికి మాదకద్రవ్యాలను విడనాడాలి

- మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు
- విద్యార్థులకు డ్రగ్స్ వల్ల జరిగే నష్టాలను తెలియజేసిన పోలీసులు


రాజంపేట: ర్యాలీని ప్రారంభిస్తున్న సెబ్ సీఐ పవన్, చొప్పా ఎల్లారెడ్డిలు


రైల్వేకోడూరు: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ చైతన్య, పోలీసులు

సిద్దవటం : మాదకద్రవ్యాలను విడనాడి ప్రశాంతమైన జీవనం సాగించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ నాగరాజు తెలిపారు. బుధవారం సిద్దవటంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ప్రధాన బస్టాప్, ఎంఈఓ కార్యాలయం, పోలీసు స్టేషన్ మలుపు వరకు సాగింది. ర్యాలీలో గంజాయి వద్దు, ఆరోగ్యం ముద్దు అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం సీఐ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ గంజాయి, మాదక ద్రవ్యాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండటానికి దురలవాట్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు సిగరెట్, గంజాయి జోలికి వెళ్లకూడదన్నారు. ఎస్ఐ పెద్ద ఓబన్న మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుతారన్నారు. చెడు వ్యసనాలను దరి చేరకుండా నియంత్రించుకుంటేనే బంగారు భవిష్యత్తు సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల చైర్మన్ మునిస్వామి, పోలీసులు పాల్గొన్నారు.

ఏయూలో అవగాహన సదస్సు, ర్యాలీ

రాజంపేట : అన్నమాచార్య యూనవర్సిటీలో అంతర్జాతీయ డ్రగ్స్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం ఏయూ సభా భవనంలో విద్యార్థులు మాదకద్రవ్యాల వాడకం వల్ల జరిగే నష్టాలు గురించి రాజంపేట డీఎస్పీ చైతన్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు నేటి యువత దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల శారీరకంగా బలహీనపడతారన్నారు. జీవితాలు చిద్రమవుతాయన్నది తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించామని, నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్పీతో పాటు ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, సీఐలు మద్దయ్య ఆచారి, రవీంద్ర, మంజునాథరెడ్డి, సెబ్ సీఐ పవన్‌కుమార్, ఎస్ఐ మోహనకుమార్‌గౌడ్, నందలూరు ఎస్ఐ మహమ్మద్‌అబ్దుల్, ఏయూలో వివిధ విభాగాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఏయూ మెయిన్ బిల్డింగ్ నుంచి న్యూ బోయనపల్లె ఏయూ సర్కిల్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించారు. మాదకద్రవ్యాల వినియోగంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఫార్మసీ కళాశాలకు చెందిన ద్వారకనాథరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెడు అలవాట్లతో జీవితాలు బుగ్గిపాలు

రాయచోటి టౌన్ : విద్యార్థి దశలో ఎవరైతే చెడు అలవాట్లకు లోనవుతారో వారి జీవితాలు బుగ్గిపాలవుతాయని అర్బన్ ఎస్ఐ భక్తవత్సలం విద్యార్థులకు సూచించారు. బుధవారం రాయచోటి ఏపీ మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన విద్యార్థులకు మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలను వివరించి చెప్పారు. చెడు అలవాట్లకు బానిసగా మారిన స్నేహితులకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రేఖ, ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ ప్రసన్న కుమార్‌లు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కాకూడదు

నేటితరం యువత మత్తుకు బానిస కాకూడదని ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. బుధవారం రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహణలో భాగంగా విద్యార్థులకు సూచనలు – సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ వినయ్ బాబులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

రాయచోటి అర్బన్ : యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సాయి ఇంజనీరింగ్ కళాశాల ఏడీ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొకైన్, హెరాయిన్, గుట్కా, పొగాకు, ఆల్కాహాల్ వంటి మత్తు పదార్థాలను సేవించడం వలన అనారోగ్యానికి గురవుతారన్నారు. విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బాలాజి, ఎన్ఎస్ఎస్ అధికారి కరుణాకర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

వీరబల్లె : మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మండల ఎస్ఐ చంద్రమోహన్ బుధవారం మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువతీ యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా చదువుకునే విద్యార్థులు వాటి గురించి కుటుంబ సభ్యులకు, అలాగే మీ గ్రామాలలో మత్తు పదార్థాలు గురించి అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు, యువతీయువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రఘురామయ్య, కళాశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాధవ ద్రవ్యాలతో అనర్థాలు

రైల్వేకోడూరు : మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో రహదారి మీదుగా పోలీసులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ చైతన్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం కరోనా వైరస్ కంటే అత్యంత భయంకరమైనదన్నారు. డ్రగ్స్ వినియోగం సమాజంలో అతి పెద్ద సమస్యగా మారిందన్నారు. ముఖ్యంగా యువత వాటి బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చెడు స్నేహాల వలన మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న యువత తమ భవిష్యత్‌ను తామే నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిశితంగా పరిశీలిస్తుండాలని సూచించారు. మాదక ద్రవ్యాల అమ్మకాలు, వినియోగం వంటివి గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ వినియోగంపై యువతను చైతన్య వంతం చేయాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : యువత మత్తుకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. అంతర్జాతీయ మత్తు, మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ యువత మత్తుకు బానిస కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జబీవుల్లా, హెడ్ కానిస్టేబుల్ మోహన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


లక్కిరెడ్డిపల్లె: డ్రగ్స్ అనర్థాలపై ప్రజలకు ర్యాలీ ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం



రాయచోటి టౌన్: మాట్లాడుతున్న అర్బన్ ఎస్ఐ భక్తవత్సలం


సిద్దవటం: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


వీరబల్లె: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రమోహన్

సమస్యల పరిష్కారానికి కృషి


సీతారామపురంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి బుధవారం మండల పరిధిలోని సీతారామపురం గ్రామంను సందర్శించారు. ఆ గ్రామంలోని ప్రజలను, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ ప్రజలు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే ఆకేపాటి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంజం రాంసీతమ్మ పెద్దకర్మకు హాజరైన కొరముట్ల


రాంసీతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని తూర్పుపల్లెకు చెందిన పంజం రాంసీతమ్మ పెద్దకర్మకు బుధవారం మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు హాజరయ్యారు. రాంసీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పంజం సుకుమార్‌రెడ్డి, చెవ్వ శ్రీనివాసులరెడ్డి, రమణారెడ్డి, తోట శివసాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రభాస్ అభిమానుల ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ప్రభాస్ అభిమానులు

రైల్వేకోడూరు అర్బన్ : ప్రభాస్ నటించిన కల్కి సినిమా గురువారం విడుదల అవుతున్న సందర్భంగా బుధవారం కోడూరు పట్టణంలో అభిమానులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా సినిమా హాలుకు చేరుకొని బాణాసంచాలను పేల్చారు. కాగా గురువారం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రవికుమార్ రాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ తెలిపారు. ఆదర్శ పాఠశాలలో 7వ తరగతిలో మూడు ఖాళీలు, 8వ తరగతిలో రెండు ఖాళీలు, 9వ తరగతిలో ఎనిమిది ఖాళీలు ఉన్నాయన్నారు. ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తులు పంపాలన్నారు. ఓసీ, బీసీలు రూ. 150లు, ఎస్సీ, ఎస్టీలు రూ. 75లు పరీక్ష రుసుము చెల్లించాలన్నారు. ఈ పరీక్ష రుసుమును పాఠశాలలో నేరుగా చెల్లించాలన్నారు. జూలై 2వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ పరీక్షలో ప్రస్తుతం చదివిన తరగతిలోని సిలబస్‌లతో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు నేరుగా ఆదర్శ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అక్రమ లే-అవుట్‌కు నోటీసులు జారీ

సిద్దవటం : అక్రమంగా లే-అవుట్‌లు వేస్తున్న గోపవరం లక్ష్మీనరసయ్య అనే వ్యక్తికి బుధవారం నోటీసులు జారీ చేశామని గ్రామ సచివాలయ కార్యదర్శి సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా సిద్దవటం మండలంలోని కడప – చెన్నై ప్రధాన రహదారిలోని బొగ్గిడివారిపల్లె గ్రామ పంచాయతీ సర్వేనెంబర్ 878లో 1.98 ఎకరాల భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా లే-అవుట్లు వేస్తున్నారన్న సమాచారంతో నోటీసులు జారీ చేశామన్నారు. గ్రామ పంచాయతీ అప్రూవల్ వచ్చేంత వరకు పనులను నిలుపుదల చేయాలని పేర్కొన్నారు. అప్రూవల్ లేకుండా కట్టడాలు, భవనా నిర్మాణాలు, లేఅవుట్లు నిర్మించకూడదని ఆమె ప్రకటనలో తెలియజేశారు.

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

పుల్లంపేట : పుల్లంపేటలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న ఎస్.హేమంత్, కె.రిత్విక్ రెడ్డి, ఎం.పూజ అనే ముగ్గురు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

విద్యా సామగ్రి అందజేత


విద్యార్థులకు సామగ్రిని అందిస్తున్న ఎంఈఓలు

రామాపురం : పేద విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశామని ఎంఈఓలు రామకృష్ణుడు, జయచంద్రలు తెలిపారు. బుధవారం మండలంలోని రాచపల్లె పంచాయతీ గంగనేరులో కీర్తిశేషులు ప్రధానోపాధ్యాయులు వెంకటన్న జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వాసుదేవ్ కుమార్ వెంకటాపురంలోని మూడు ప్రాథమిక పాఠశాలలోని సుమారు 150 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

29న ఉచిత మెడికల్ క్యాంపు

రాయచోటి టౌన్ : ఈ నెల 29న నిర్వహించే ఉచిత మెగా మెడికల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్వర మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ యజమాని డాక్టర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ఆస్పత్రి మొదటి వార్షికోత్సవం సందర్భంగా ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఈ మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ క్యాంపులో అన్ని రకాల జబ్బులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉచితంగా ఏపీ, రక్త పరీక్షలు, స్కానింగ్, ఇతర పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఆపరేషన్లు అవసరం అయిన వారికి 50శాతం సబ్సిడీతో నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ అవకాశాన్ని రాయచోటి ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

నివాళి


పుల్లారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రామాపురం : మండలంలోని కల్పనాయునిచెరువు గ్రామం మూగిరెడ్డిగారిపల్లెకు చెందిన తుమ్మల పుల్లారెడ్డి మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి బుధవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని, నివాళి అర్పించారు. ఆయనతో పాటు సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, మాజీ సరపచ్ వెంకటసుబ్బారెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రామచంద్రరెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1న ఉచిత వైద్య శిబిరం

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని ఐబీటీ ఎదురుగా ఉన్న పాత కళాశాల మైదానంలో జూలై 1న మదనపల్లె వెంకటేశ్వర హార్ట్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ కిషోర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి వారు ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక ప్రణాళిక


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

రాయచోటి అర్బన్ : పట్టణంలో పారిశుధ్యంను మెరుగుపర్చేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వాసుబాబు చెప్పారు. బుధవారం పట్టణంలోని 4, 5, 6, 7, 8 వార్డులలోని పలు వీధులలో కమిషనర్ వాసుబాబు, మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులతో కలసి పర్యటించారు. పలు వీధులలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కొత్తపల్లె లాంటి స్లమ్ ఏరియాలలో పారిశుధ్యం పనుల మెరుగునకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. సచివాలయం సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో పారిశుధ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామంటూ చెప్పారు. ప్రధానంగా రోడ్లపైన, ఖాళీ స్థలాల్లో, మురుగునీటి కాలువల్లో చెత్తను పారవేయకుండా ప్రజలకు, దుకాణాదారులకు అవగాహన కల్పించడం ద్వారా వారిలో మార్పు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ప్రధానంగా పట్టణ పరిశుభ్రతకు ప్రజలు, దుకాణాదారులు పూర్తిస్థాయిలో సహకరించాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, శానిటరీ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె హామీలను అమలుచేయాలి


మాట్లాడుతున్న యూనియన్ జిల్లా నేతలు

రాయచోటి అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వి.రమణ, పి.వి.రమణలు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో 15 రోజులపాటు మున్సిపల్ కార్మికులు నిర్వహించిన సమ్మెకు అప్పటి పాలకులు దిగివచ్చి సమ్మె కాలానికి వేతనంతో పాటు డ్రైవర్లకు రూ.24,500 వేతనం అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ మేరకు ప్రభుత్వ జీఓలు ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఆప్కాస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. ఎన్నికల్లో పనిచేసిన రాజంపేట, రాయచోటి మున్సిపల్ వర్కర్లకు స్టైఫండ్‌ను చెల్లించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలను ఇవ్వాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ. 18,500 అమలు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి రాంబాబు, నేత విజయకుమార్‌లు పాల్గొన్నారు.

అలరిస్తున్న పౌరాణిక నాటకాలు


మహాభారత యజ్ఞాన్ని నాటక రూపంలో ప్రదర్శిస్తున్న కళాకారులు

రామాపురం : అంతరించిపోతున్న కలలకు అప్పుడప్పుడు జీవం పోసే దిశగా అక్కడక్కడ పౌరాణిక నాటకాలు వెలుస్తున్నాయి. గతంలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పౌరాణిక నాటకాలు చేసేందుకు ఎగబడేవారు. మారుతున్న కాలంలో ప్రజలకు అందుబాటులో యూట్యూబ్, వాట్సాప్‌లలో ప్రతినిత్యం సమాచారం త్వరగా ప్రజలకు చేరుతోంది. అలాంటి సమయాల్లో పౌరాణిక నాటకాలు చేసేవారు తగ్గిపోయారు. ఈ పౌరాణిక నాటకాలు ప్రస్తుతం అక్కడక్కడ కనిపిస్తున్నాయి. మహాభారత యజ్ఞానికి సంబంధించి మండల కేంద్రంలో 18 రోజులపాటు జరిగే మహాభారత కథ పగటి సమయంలో హరికథ రూపంలో చెబుతుండగా, రాత్రి సమయంలో పౌరాణిక నాటక రూపంలో కళాకారులు ప్రజలకు వివరిస్తున్నారు. ఈ పౌరాణిక నాటకాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. నాటకాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు వస్తున్నారు.

ప్రత్యేక హోదాపై ఉద్యమం

బి.కొత్తకోట: ప్రత్యేకహోదా ఉద్యమం చేపట్టేందుకు విద్యార్థులు, యువతను సన్నద్ధం చేస్తున్నట్లు విద్యార్థి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వి.ఉత్తన్న అన్నారు. బుధవారం బి.కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా అధ్యక్షుడు గంగరాజుతో కలిసి తంబళ్లపల్లె నియోజకవర్గ జేఏసీ కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధన కోసం మరోసారి ఉద్యమం చేపట్టాలని నిర్ణయించామని అన్నారు. హోదా వస్తే పరిశ్రమలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు వస్తాయన్నారు. దీనికోసం జేఏసీని బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

అగ్నివీర్ పథకాన్ని రద్దుచేయాలి

రాయచోటి అర్బన్ : కేంద్ర ప్రభుత్వం సైనికుల రిక్రూట్‌మెంట్ కోసం 2022 నుంచి అమలులోకి తీసుకువచ్చిన అగ్నివీర్ పథకాన్ని వెంటనే రద్దుచేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెచ్చిన అగ్నివీర్ పథకం సైనిక వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉందన్నారు. అగ్నివీర్ పథకంలో సైన్యానికి ఎంపికైన వారు 4 సంవత్సరాల తర్వాత రిటైర్ కావలసి ఉంటుందన్నారు. ఈ పథకాన్ని బిజెపి అడ్డుపెట్టుకుని ఆపార్టీ నేతలు తమకు కావలసిన యువతకు సైన్యంలో శిక్షణను ఇప్పించి తరువాత వారిని తమ పార్టీ ప్రయోజనాల కోసం వినియోగించుకునే అవకాశం లేకపోలేదన్నారు. వెంటనే అగ్నివీర్‌ను రద్దుచేసి సైనికుల రిక్రూట్‌మెంట్‌ను పాత పద్ధతిలోనే అమలు పరచాలంటూ కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టవలసి వస్తుందంటూ హెచ్చరించారు.

ప్రతి కార్యకర్తను ఆదుకుంటాం


మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

నందలూరు : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో వచ్చే ఐదేళ్లలో ప్రతి కార్యకర్తను అన్ని విధాల ఆదుకుంటామని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం తెలియజేశారు. బుధవారం నందలూరు షాదీఖానాలో రాజంపేట ఎన్డీయే కూటమి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పర్యటించి పార్టీ కోసం నిజాయతీగా పనిచేసిన వారికి భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికలలో పదవులు ఇవ్వడంతో పాటు ఆర్థికంగా వారికి తోడునీడగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎద్దుల సుబ్బరాయుడు, ఎల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, జంగంశెట్టి సుబ్బయ్య, ఎద్దల విజయసాగర్, సయ్యద్ అమీర్, మున్వర్ బాషా, విఠలాచార్య, మోడపోతుల రాము, హేమలత, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలకు సన్మానం

పుల్లంపేట : మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఎంఈఓలు నాగా తిరుమలరావు, చక్రధర్ రాజులను సీఆర్‌పీలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయం పాటించి సరళమైన రీతిలో విద్యార్థులకు విద్యాబోధన అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు ఆనంద్, శివ, ఉపాధ్యాయులు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు


స్వామి, అమ్మవార్లకు పాన్పుసేవ నిర్వహిస్తున్న దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరులోని 17వ శతాబ్దం నాటి వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారంతో అత్యంత వైభవంగా ముగిశాయి. 11 రోజులపాటు ప్రతిరోజూ హరికథ కాలక్షేపంతోపాటు వేదపండితుల మంత్రోచ్ఛరణలతో పూజలు చేసి ఈ బ్రహ్మోత్సవాలను ముగించినట్లు ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, ఆలయ పూజారి చంద్రశేఖర్ శర్మలు తెలిపారు. వేణుగోపాలస్వామికి పాన్పు సేవతో ఈ బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ పాన్పు సేవను గ్రామంలోని అన్ని కులాల వారు కలిసి నిర్వహిస్తారు. ఒక్కో రోజు ఒక్కొక్క వాహనంపై వేణుగోపాలస్వామి, రుక్మిణీ, సత్యభామలు పురవీధులలో ఊరేగారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించడంతోపాటు రోడ్డు వెంబడి విద్యుత్ దీపాలతో పలువురు దేవతల ప్రతిమలను సుందరంగా ఏర్పాటు చేశారు. గ్రామంలో ఏకతాటిపై ప్రజలు ఈ బ్రహ్మోత్సవాలకు సహకరించినందుకు వారందరికీ ఆలయ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


మహబూబ్ నగర్ గ్రామంలో అబెట్ ద్రావణాన్ని స్ప్రేయింగ్ చేయిస్తున్న వైద్య సిబ్బంది

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం, మహబూబ్ నగర్ గ్రామాల్లోని ప్రజలకు బుధవారం డెంగ్యూ, మలేరియా వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించామని మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ మాధవరం–1 గ్రామ పంచాయతీలో 11 సంవత్సరాలు వయస్సు కలిగిన మహేష్ అనే బాలుడికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ కావడంతో బాలుడి ఆరోగ్యంపై కుటుంబీకులతో విచారించామన్నారు. బాలుడుని పరీక్షించామని, ఆరోగ్యవంతంగా ఉన్నాడన్నారు. ప్రతి ఇళ్లు తిరిగి లార్వా సర్వే జరిపామన్నారు. మీ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా మురుగు నీరు నిల్వ లేకుండా ప్రతి ఒక్కరూ చూసుకోవాలని తెలియజేశారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ లక్ష్మీపురం, మహబూబ్‌నగర్ గ్రామాల్లో విష జ్వరాలు సోకకుండా అపరిశుభ్ర ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో దోమలు ఉత్పత్తి కాకుండా 50 ఇళ్లకు పైగా సర్వే చేసి ఆ ప్రాంతాల్లో అబెట్ ద్రావణాన్ని స్ప్రేయింగ్ చేయించామన్నారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు డయేరియా క్యాంపులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రమణయ్య, ఆశ వర్కర్‌లు, ఆరోగ్య కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అతిసారాపై అవగాహన కల్పించాలి


వైద్యులు, ఆశ కార్యకర్తలకు సూచనలు, సలహాలు చేస్తున్న డీపీఎంఓ డాక్టర్ రియాజ్ బేగ్

సంబేపల్లె : అతిసారాపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి (డీపీఎంఓ) డాక్టర్ రియాజ్ బేగ్ అన్నారు. బుధవారం మండలంలోని దేవపట్ల పీహెచ్‌సీ పరిధిలో సోమవరం పంచాయతీలోని దేవలంపేటలో డీఎస్ఎంఓ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వచ్చినందున వర్షాలు పడుట, మామిడి పళ్ల సీజన్ కావడం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వల్ల విరేచనాలు ప్రబలడం జరుగుతుందన్నారు. వర్షాభావ పరిస్థితులు వల్ల కొత్త నీళ్లు కలుషితమవుతున్నాయన్నారు. కావున నీటిని కాచి వడపోసుకుని తాగాలని, మలవిసర్జనకు మరుగుదొడ్లు ఉపయోగించుకోవాలని, చేతులు శుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి వనరులు కలుషితం చేయరాదని తెలిపారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మల్లికార్జున, పర్యవేక్షకులు మహబూబ్ బాష, ఎల్‌హెచ్‌పీఎస్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.